# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ - కర్ణాటక రాష్ట్రాల మధ్య ఎల్లప్పుడూ సుహృద్భావ వాతావరణం ఉంటుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ రాష్ట్రంలో ధరల స్థిరీకరణకు నిధులు కేటాయించాలని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు.
- ❖ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.
- ❖ అవయవదానంపై కీలక మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ - కర్ణాటక రాష్ట్రాల మధ్య ఎల్లప్పుడూ సుహృద్భావ వాతావరణం ఉంటుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. ఈరోజు బెంగుళూరు వెళ్ళిన పవన్ కళ్యాణ్ కర్నాటక రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రే తో పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... రెండు రాష్ట్రాల అధికారులు, పాలకులు కలిసి పని చేస్తే... చాలా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్రంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల సమస్య పరిష్కారానికి కర్ణాటక సహకారం అందించడం సంతోషం కలిగించిందన్నారు. చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గ్రామాల్లోకి వస్తున్న ఏనుగులను తిరిగి అడవుల్లోకి పంపించేందుకు అవసరమైన కుంకి ఏనుగులను ఆంధ్రప్రదేశ్ కు అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించిందని, ఇది మంచి పరిణామమని వ్యాఖ్యానించారు. అటవీ సంపద రక్షణకు సాంకేతికతను వినియోగించుకునే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించామని ఉప ముఖ్యమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల సేవలు, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమయ్యారు. ధరల స్థిరీకరణకు 532 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రానికి కందిపప్పు కేటాయింపులు పెంచాయని, రాష్ట్రానికి రావాల్సిన 1,187 కోట్ల రూపాయల పెండింగ్

నిధులను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా... 11 సిలో గోదాముల నిర్మాణానికి అనుమతించాలని, మరో 8 ప్రెస్ రిపోర్టింగ్ కేంద్రాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కాగా... ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి... వీటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని మంత్రి నాదేండ్ల మనోహర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏలూరు ఆర్టీసీ డిపోలో దూర ప్రాంతాలకు వెళ్లే 30 సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ స్లీపర్ బస్సు సర్వీసులను ఈరోజు మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వంలో ఇప్పటివరకు ఒక వెయ్యి 400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. ఆర్టీసీ సంస్థను మరింత సమర్ధవంతంగా నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, అలాగే... ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అవయవదానంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. బ్రెయిన్ డెడ్ కేసుల అవయవాల సేకరణపై తాజా మార్గదర్శకాలను పాటించాలని అధికార యంత్రాంగానికి సూచనలు చేసింది. అవయవదానానికి సంబంధించి కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రిలోని డీన్, మెడికల్ సూపరింటెండెంట్ లేదా జీవన్ దాన్ కార్యక్రమంలో నమోదైన ఆస్పత్రుల నుంచి సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏపీ స్టేట్ ఆర్గాన్ టిష్యూస్ ట్రాన్స్ ప్లాంటేషన్ సంస్థకు ఎలాంటి ఆలస్యం లేకుండా సమాచారం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే సమయంలో అవయదానం చేసిన వారికి సంబంధించిన భౌతికకాయానికి తగిన గౌరవం ఇచ్చేలా చూడాలని, అంత్యక్రియలు కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మార్గదర్శకాలు విడుదల చేశారు. అంత్యక్రియలకు 10 వేల రూపాయల ఆర్థిక సాయంతో పాటు జిల్లా కలెక్టర్ తరఫున ప్రభుత్వ ప్రతినిధిగా ఒకరు హాజరు కావాలని మర్గదర్శకాల్లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి కె. అచ్చన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, ప్రకృతి సేద్యం సలహాదారు టి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి 11 కోట్ల రూపాయలు మంజూరు చేశామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. పురుషోత్తపల్లిలో 440 మీటర్ల నిడివి గల రహదారిని 30 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నామన్నారు. రహదారుల నిర్మాణాల్లో పంచాయతీ రాజ్ అధికారులు, గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మంత్రి ఆదేశించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతిలోని వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కేంద్ర కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని జాయింట్ కమిషనర్ ఆర్.హరిహరన్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ రక్తదాన శిబిరం ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ప్రవేశించనుందని తెలిపారు. జిఎస్టి ఉద్యోగులతో పాటు విద్యార్థులు, మహిళలు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారని పేర్కొన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా రక్తం అవసరమని.. వారిని దృష్టిలో ఉంచుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతిలో రెండు చోట్ల శిబిరాలను నిర్వహించామని, రుయా ఆసుపత్రి సిబ్బంది రక్తదాన శిబిరానికి సహాయ సహకారాలు అందించారని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పిఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులైన వారు నమోదు చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... గ్రామ, వార్డు సచివాలయాలు, సి.యస్.సి కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. సంప్రదాయ, చేతి వృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన ప్రారంభించిందని, దీని ద్వారా కేవలం 5 శాతం వడ్డీకి 3 లక్షల రూపాయల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. చేతి వృత్తులు చేసుకునే వెనుకబడిన వర్గాల వారి కోసం ఈ పథకం కింద 15 వేల కోట్ల రూపాయలు కేటాయించారని, అలాగే ఈ పథకం 2028 వరకు అమలులో ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం-నిజాముద్దీన్ ల మధ్య నడిచే సమతా ఎక్స్‌ప్రెస్ ను విజయవాడ మీదుగా నడుపుతున్నామని వాల్తేర్ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు విశాఖపట్నంలో బయలుదేరిన సమతా ఎక్స్‌ప్రెస్ విజయవాడ - నాగ్‌పూర్ మీదుగా నిజాముద్దీన్ వెళుతుందని, అదేవిధంగా రేపు నిజాముద్దీన్‌లో బయలుదేరే సమతా ఎక్స్‌ప్రెస్ నాగపూర్, విజయవాడ మీదుగా విశాఖ చేరుకుంటుందన్నారు. ఆగ్నేయ మధ్య రైల్వేలోని నాగ్‌పూర్ డివిజన్‌లోని ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను ఇతర మార్గాల్లో నడుపుతున్నామని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేలా విధులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ సరఫరా సంస్థ (APSPDCL) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు అధికారులకు సూచించారు. తిరుపతిలోని సంస్థ ముఖ్య కార్యాలయంలో ఈరోజు ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నిరోధించాలని, ఈ అంశంపై సర్కిల్, డివిజన్, సబ్-డివిజన్, సెక్షన్ స్థాయిల్లో సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని సూచించారు. వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వాన్ని సహించేదిలేదని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా నదికి వరద ఉధృతి పెరుగుతన్న నేపథ్యంలో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ గీతాబాయి తెలిపారు. నదీ పరివాహిక ప్రాంతాల్లోని వైద్య అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని, అవసరమైన మందులు, అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. నదికి కొత్త నీరు వస్తున్నందున డయేరియా బారిన పడకుండా ప్రజలు కాచి, చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. జ్వరం, జలుబు వంటి అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళి చికిత్స తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

================================

విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో ఈరోజు జరిగిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి, ర్యాగింగ్ నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

================================
================================